
## ప్రమీలావతీ దేవి



# పురుషులందు పుణ్య పురుషులు

బండి కదలడానికి సూచనగా ఓసారి గట్టిగా కూసింది. గార్డు విజిల్ వూదేరు. నెమ్మదిగా కదిలి వేగం పుంజుకోసాగింది ట్రెయిన్. అంతవరకు గుమ్మందగ్గరే నిల్చున్న వసంత ఇక తప్పదన్నట్లు ఆ చోటునుంచి కదిలి తన సీటులోకొచ్చి కూర్చుంది. కాని ఆమె ముఖంలో దిగులు, కన్నుల్లో తడి ఇంకా పోలేదు. మనసులో బాధ, కోపం, దుఃఖం బండిలోంచి దూకి ఇంటికి పారిపోవాలనిపిస్తున్నది ఆమెకు. అంతవరకు సామాన్లు సర్ది ఆమె ప్రక్కకొచ్చి కూర్చున్నాడు చక్రపాణి. భార్య ఏడుస్తున్నట్లు గ్రహించేడతను.

"ఛ...చిన్నపిల్లలా ఏడుస్తున్నావా?" అడిగేరు గుసగుసల స్వరంతో చిన్నగా.

మాట్లాడలేదు వసంత. ఎర్రబారిన కళ్లతో కిటికీలోంచి బైటికి చూడసాగింది.

"చూడు. అందరూ నిన్నే చూస్తున్నారు. కళ్ళు తుడుచుకో. నవ్వు ముఖం పెట్టు" మరోసారి భార్యని హెచ్చరించాడు.

వసంత కళ్ళు తుడుచుకుంది కాని నవ్వుముఖం మాత్రం పెట్టలేదు. మరింత ముడుచుకుని కూర్చుంది.

భార్యని నవ్వించాలని అతను చాల ప్రయత్నించాడు. కబుర్లు చెప్పబోతే 'ఆఁ' 'ఊఁ'లతో సరిపెట్టేది. కాఫీ తాగుతావా, ఆ పళ్ళు తీసుకోనా, ఏమైనా పుస్తకాలు తీసుకురానా? హైదరాబాద్ ఎంత బాగుంటుందనుకున్నావు! అక్కడ చూడ వలసినవి ఎన్నో వున్నాయి. అవన్నీ వరుసగా చూపిస్తాను. నువ్వలా ముఖం ముడుచుకుని కూర్చుంటే నాకేమీ బాగా లేదు. నువ్వుకూడా కబుర్లు చెప్పకూడదూ! వాళ్ళు చూడు ఎలా మాట్లాడుకుంటున్నారో! అలా వుండాలి కొత్త దంపతులంటే. మవునంగా వున్నావు. ఓ మాటా, మంచి, సరదాలేకుండా. ప్చ్" అతను ఆమెను అలా మాట్లాడిస్తూనే వున్నాడు గమ్యం చేరుకునే వరకూ. కాని ఆమె అతని మాటల్లో పాలుపంచుకుంటే కదా! ఆమెకు తన ఫ్రెండ్సు మాటలే వినిపిస్తున్నాయి చెవుల్లో.

"అతన్నెలా చేసుకుంటున్నావే!"

"పగలు చూస్తే రాత్రి కల్లోకి వచ్చేలా వున్నాడు బాబూ!"

"నీ స్థానంలో నేనేగాని వుంటేనా ఛస్తే ఈ పెళ్ళికి అంగీకరించేదాన్ని కాదు."


"కట్నం యివ్వక్కర్లేదు కదా అని మీవాళ్ళు నీకు చాలా అన్యాయం చేసారే!"

"అన్నంలోకి తగిన కూర లేకపోతే ఆ అన్నం తినబుద్ధే కాదు... ప్చ్. నువ్వు చాలా దురదృష్టవంతురాలివే వసంతా!"

తన పెళ్ళయినప్పటి నుంచీ తన ఫ్రెండ్సు తనని ఇలాగే హేళన చేస్తున్నారు. ఆ మాటలు గుర్తొస్తే చాలు మనసు రోదిస్తున్నది. భోరున ఏడవాలని వుంది తనకి. కాని తను ఏడిస్తే ఎవరికి బాధ! తన పెళ్ళి చేసి తనమీద వున్న బరువుని దింపేసుకున్నారు ఇద్దరన్నయ్యలూను. 'ఇప్పటికైనా అమ్మాయి ఓ యింటిదైంది. ఇక నేను ఏమైపోయినా బెంగలేదు' అని అమ్మ సంతృప్తిపడింది. కాని ఈ పెళ్ళివల్ల జీవితాంతమూ దుఃఖపడేది తనే కదా! వసంత కళ్ళెత్తి భర్తవేపు చూసింది. అతను ఎదురుసీట్లో కూర్చున్న వ్యక్తితో రాజకీయాలు మాట్లాడేస్తున్నాడు వుద్రేకంగా. అయిష్టంగా ముఖాన్ని మరో వైపుకు తిప్పేసుకుంది వసంత.

* * *

వసంత అందమైన వాళ్ళల్లోనే జమవుతుంది. తెల్లగా, సన్నగా, సన్నజాజి మొగ్గలా నాజూగ్గా వుంటుంది. పొడవాటి




వాలుజడ, దొండపండులాంటి పెదవులు, పెద్దపెద్ద నేత్రాలతో చూడముచ్చటగా ఉంటుంది. 'ఆ అమ్మాయి చాలా అందంగా వుంటుంది' అని నలుగురూ అనుకోవడమే కాదు. 'తాను చాలా అందంగా వుంటుంది' అనే నమ్మకం, అహంకారం కూడా వున్నాయి వసంతకు. 'తన అందానికి తగిన వ్యక్తి దొరికితేనే గాని పెళ్ళి చేసుకోను' అని మనసులోనే భీష్మించుకున్నందున తండ్రి ఏ సంబంధంచూసినా 'నాకు నచ్చలేదు. నేను చేసుకోను. కాదు కూడదని ఈ సంబంధం చేస్తే నూతిలో దూకి చస్తాను' అనేది పెంకిగా.

కూతురి మనసు నొప్పించలేక, ఆమెకు నచ్చిన సంబంధం తేలేక తండ్రి ఓ రోజు హఠాత్తుగా కన్నుమూశాడు. ఇంటి పెత్తనం కొడుకుల కెళ్ళింది. తల్లిమాట చెల్లనిదైపోయింది ఆ యింట. 'మీ తండ్రి దాని పెళ్ళి చేయలేకపోయాడు. మీరైనా దాన్ని ఓ యింటిదాన్ని చేసి పుణ్యం కట్టుకోండి' అని తల్లి పోరగా పోరగా, చెల్లెలి పెళ్ళిప్రయత్నం చేయసాగేరు. వాళ్ళు వసంతను ముందే హెచ్చరించారు. 'నాన్న మాకు ఆస్థి పోగుచేసి ఇవ్వలేదు. మా సంపాదన మా కుటుంబాలకే చాలదు. కాబట్టి కట్న కానుకలంటూ పెద్దఎత్తున ఇచ్చి కొండ మీది కోతిని తీసుకురాలేము నీకోసం. మా తాహతుకి తూగగల సంబంధం చూస్తాము. ఆ సంబంధమే చేసుకోవాలి నువ్వు. నాన్నకి చెప్పినట్లు 'అతను నాకు నచ్చలేదు, అతను చేసే ఉద్యోగం మంచిది కాదు' అని వంకలు పెట్టావంటే ఈ జన్మలో నీ పెళ్ళి చేయలేము' అని.

ఆ మాట ప్రకారమే ఓ సంబంధం చూసారు. వాళ్ళ అదృష్టమో వసంత దురదృష్టమో కాని అతనికి వసంత బాగా నచ్చింది. ఎంత నచ్చిందంటే 'నాకు కట్నం ఇవ్వక్కర్లేదు. మీ అమ్మాయిని పెళ్ళి చేస్తే చాలు' అనే

మాట యిచ్చేంతవరకూను.

ఈ సంబంధం వసంతకు తప్పించి మిగతా అందరికీ ముఖ్యంగా ఆమె అన్నయ్యలకు వదినలకు బాగా నచ్చింది. ఎందుకు నచ్చదూ వేలకువేలు కట్నాల రూపంలో గుంజే ఈ రోజుల్లో కట్నం వద్దు, కానుకలొద్దు అనే మగవాళ్ళే కరువు కదా.

కొడుకుల మనసు గ్రహించిన తల్లి "అబ్బాయి కొంత నలుపన్న మాటేగాని బుద్ధిమంతుడిలాగానే వున్నాడు. ఈ సంబంధమే ఖాయంచేయండి" అంది తల్లి.

అదే ఖాయం చేసారు వాళ్ళు. అంతే గాని వసంతను 'పెళ్ళికొడుకు నీకు నచ్చేడా? ఏమైనా అభ్యంతరాలున్నాయా?' అని అడగలేదు అన్నగార్లు. ఈ సంబంధం గురించి అడుగుతారేమో అప్పుడు 'నా కీ సంబంధం ఇష్టంలేదు, కాదు కూడదని చేస్తే ఉరేసుకు చస్తాను నాకేం భయమా' అని ఆలోచించుకున్న వసంతకు ఆ మాట చెప్పే పనే లేక పోయింది. అందరు ఆడపిల్లల్లా అదే కాపురం చేసుకుంటుందిలే అనే ధీమాతో పెళ్ళి ముహూర్తం పెట్టించి పెళ్ళి పనులు చకచకా చేసేసారు.

పెళ్ళి చేసుకున్న వ్యక్తితో జీవి తాంతమూ కలిసి జీవించాల్సిన తనతో సంప్రదించకుండా, తన యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా పెళ్ళి చేస్తున్నందుకు ఆమెకు చాలా కోపంగాను, బాధగాను, ఉక్రోషంగానూ వుంది. ఈ పెళ్ళి జరక్కుండా తనకో అతనికో ఏదైనా అవాంతరం జరక్కూడదూ ముహూర్తం టైముకి తను ఎక్కడికన్నా పారిపోతే.. లేదా ఏదైనా మింగి చచ్చిపోతే...ఛ... ఛ...ఎంత పిరికిదానిలా ఆలోచిస్తున్నదో! ధైర్యంగా అతని దగ్గరకే వెళ్ళి 'నువ్వు నాకు నచ్చలేదు, ఎలాగైనా ఈ పెళ్ళి జరక్కుండా ఆపించు' అని చెప్పాలని ఆవేశపడింది. కాని ఆశ్చర్యమైన విషయ మేమంటే మనసులోని ఆలోచనల్ని ఒక్కటీ ఆచరించలేకపోయింది. చాలా మంది ఆడపిల్లల్లానే మనసులోని ఉద్రే కాన్ని, రోషాన్ని వ్యక్తం చేయకుండానే బుద్ధిగా తలవంచి అతనిచేతే మూడు ముళ్ళు వేయించేసుకుని, నిస్సహాయతగా వెక్కివెక్కి ఏడ్చేసింది. ఆ తరువాత భర్త వెంట బైలుదేరింది అయిష్టంగానే.

* * *

"ఇదే మన ఇల్లు. ఎలా వుంది?" అతను భార్యవైపు ప్రేమగా చూస్తూ అడిగాడు. మాట్లాడలేదు వసంత. మౌనంగా తల దించుకుంది. "ఈ పూట వంట ప్రయత్నం చేయకు. స్నానంచేసి హాయిగా రెస్టుతీసుకో. నేను హోటల్‌కి వెళ్ళి ఫోంచేసి నీకు పట్టుకొస్తా. అది బాత్ రూమ్, అది కిచెన్, ఇది బెడ్ రూమ్" అని అన్నీ వివరంగా చెప్పి స్నానం చేయడానికి వెళ్ళిపోయాడు చక్రపాణి.

అతనికి చాలా ఆనందంగా వుంది సంతృప్తిగానూ వుంది. తను భార్యని సుఖపెట్టాలి. సాధ్యమైనంతవరకు తన మనసు నొప్పించకుండా చూసుకోవాలి. తన భార్యని వెంటపెట్టుకుని వూరంతా తిప్పాలి. ముఖ్యంగా చంద్రకళకి, విశాలాక్షికి చూపించాలి. 'చూసారా నా భార్య ఎంత అందంగా వుందో, నా భార్య కాలి గోటికి కూడ సరిపోదు మీ అందం' అని ఎద్దేవ చేసిరావాలి' అని అతగాని మనసు వువ్విళ్ళూరసాగింది.

తను అందంగా లేదని చంద్రకళ తిరస్కరిస్తే, తన సంపాదన తన టాయిలెట్ సామానులకే సరిపోదు, ఏం పెట్టి పోషిస్తారు నన్ను' అని ఎత్తిపొడిచింది విశాలాక్షి. అందుకే మీరు చేసుకోకపోతే నా పెళ్ళి ఆగిపోయిందా. చూడండి ఎంత అందమైన అమ్మాయిని చేసుకొచ్చానో' అని చెప్పాలని మనసు వేగిరపడుతుంటే హడావిడిగా స్నానం ముగించుకుని ఇవతలకొచ్చాడు.

అతను హోటల్‌కి వెళ్ళి భోంచేసి, భార్యకి క్యారేజ్ తెచ్చాడు. వసంత అలాగే కూర్చుని వుంది దిగులుగా.

'కొత్త చోటు, తనవాళ్ళ నందరినీ వదిలిపెట్టి వచ్చినందుకు దిగులుగా వుంటుందిలే పాపం' అని భార్యవైపు సానుభూతిగా చూసేడు. "స్నానం చేసి భోంచేయి" అన్నాడు.

"ఆకలిగా లేదు, తలనొప్పిగా వుంది" అంది వసంత కూర్చున్న దగ్గరనుంచి లేవకుండా.

భార్య తలనొప్పి అనేసరికి అతను మరింత ఖంగారుపడ్డాడు. "వెళ్ళి కాఫీ, టాబ్లెట్లు తెస్తానుండు" అని బైలుదేరబోతుంటే "ఏఁవీ వద్దు. కాసేపు పడుకుంటే అదే తగ్గిపోతుంది" అని వారించింది వసంత.

భర్త వెంట తెచ్చిన సామాన్లు సర్దుకుంటే నిద్ర నటిస్తూ పడుకుంది.

రోజులు గడుస్తున్నాయి. వసంతకు ఓ సరదా లేదు, ముచ్చట లేదు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్లు దిగులుగా, దీర్ఘాలోచనతో పరాగ్గా వుండేది. వంటకూడా సరిగ్గా చేసేది కాదు. ఓ రోజు అన్నం చలిమిడిముద్దలా వుంటే మర్నాడు మేకుల్లా వండేది. కూరల్లో వుప్పు వుండేది కాదు, లేదా ఎక్కువగా వుండేది. పులుసులో పులుపు వుండేది కాదు. వేపుళ్ళు చేస్తే నల్లగా బొగ్గుల్ని గుర్తుతెచ్చేలా వుండేది. ఆ వంటల్నే మెచ్చుకుంటూ తినేస్తున్నాడు చక్రపాణి. 'వంట రాదు, కొన్నాళ్ళు ఇలాగే సరిపెట్టుకోవాలి. తరువాత తనే చేస్తుంది సరిగ్గా' అని మనసుకి నచ్చచెప్పుకుంటున్నాడు. భార్యని వెంటబెట్టుకుని సినిమాలకు, షికార్లకు తిరగాలని, ఫ్రెండ్సు ఇళ్ళకి తీసుకెళ్ళి పరిచయం చేయాలని అతని ఉబలాటం కాని అతను ఎక్కడికి రమ్మన్నా, వంట్లో బాగోలేదనో, తలనొప్పి అనో అంటుంది.

అంతే. అతని ఉత్సాహం ఎగిరిపోయేది. ఆఫీసునుంచి ఎంత ఉత్సాహంగా వచ్చేవాడో భార్య అవతారం చూసేసరికి అంత పుసూరుమనిపించేది. మొదట్లో కొన్ని రోజులు భార్యకోసం పువ్వులు, తినడానికి పళ్ళు మిఠాయిలు తెచ్చేవాడు కాని భార్య వాటిమీద ఎటువంటి ఆసక్తి చూపించకుండా నిర్లిప్తంగా వుండేసరికి అతనికి విసుగుపుట్టి ఏవీ తీసుకురావడం మానివేశాడు.

'భార్యకి తనమీద ప్రేమ లేదేమో? అందుకే అలా ముభావంగా వుంటున్నదేమో' అనే సందేహం మనసులో తుల్లో తలెత్తినా 'ఛ...ఇదేమైనా పాతరోజులా పెద్దవాళ్ళు బలవంతంగా పెళ్ళిచేస్తే చేసుకోవడానికి...కాకపోతే ఇంకా పసితనం పోలేదు తనలో. తనవాళ్ళను మరచిపోలేక అలా వుంటున్నది. కొన్ని రోజులుపోతే తనే దారికొస్తుంది అని మనసుని ఓదార్చుకుంటున్నాడు చక్రపాణి

* * *

ఆరోజు భర్త ఆఫీసుకెళ్ళిన తరవాత, ఎదురింటావిడ పిలిస్తే గుమ్మంలో నిల్చుని మాట్లాడుతున్నది వసంత అయిష్టంగానే. జిడ్డులా పట్టుకుని వదలడం లేదు. ఆవిడ 'ఈమధ్య విడుదలైన సినిమాలు ఏం చూసేరు, వాటిల్లో ఏది బాగుందీ' అనే కబుర్ల దగ్గర్నుంచి, ఏయే పుస్తకాలు చదువుతారు, వాటిల్లో వడుతున్న ఏ సీరియల్ మీకు నచ్చింది. ఏ రచయితంటే మీకు అభిమానం? మీ అభిమాన నటీనటు లెవరు?' అని అడుగుతూనే తనకి ఏ వీక్లీ ఇష్టమో, ఏ సీరియల్ ఇష్టమో, తన అభిమాన నటీనటులు, రచయిత, రచయిత్రులు ఎవరెవరో వరుసగా చెప్పేస్తున్నది అప్పుడే ఒకతను సైకిల్ నడిపించుకుంటూ వాళ్ళ ముందునుంచే వెళ్ళిపోయాడు. ఆ వ్యక్తిని వసంత, ఎదురింటావిడ కూడా చూసేరు. అతను చాలా దూరం వెళ్లాక ఆవిడ గొంతు తగ్గించి చెప్పింది, "అతను చాల బాగున్నాడు కదూ" అని.

"అవును బాగున్నాడు" పైకి అని, మనసులో మాత్రం 'చాలా అందంగా వున్నాడు. అతన్ని భర్తగా పొందిన ఆడది చాల అదృష్టవంతురాలు' అనుకుంది వసంత.

"ఇతనింత అందంగా వున్నాడా? యితని భార్య మాత్రం ఏవీ అందంగా వుండదు. పగలు చూస్తే రాత్రి కల్లోకి వచ్చేంత వికారంగా వుంటుంది ప్చ్... ఏమిటో తగిన అన్నంలోకి తగిన కూర దొరకదు అంటారు ఇటువంటివాళ్ళను చూసే సుమండీ" ఆవిడ పెదవి విరుస్తూ సాగదీసింది.

"అవును మా జంటలాగ" నన్నగా గొణుగుతూ నిర్లిప్తంగా నవ్వింది వసంత. "ఏమిటీ అంటున్నారు కాస్త గట్టిగా చెప్పండి వసంతగారూ!" ఆవిడ గలగలా నవ్వింది.

"ఆవిడ మీకు తెలుసా?" అడిగింది వసంత మాట మారుస్తూ.

"ఆకారం బాగోకపోయినా మనిషి చాల మంచిదిలెండి. ఎవరన్నా పలకరిస్తే చాలా ప్రాణం ఇస్తుంది. రేపు మిమ్మల్ని తీసుకెళ్ళి ఆవిడకు పరిచయం చేస్తా మండండి."

అలాగే అన్నట్లు తల వూపి అంగీకారం తెలిపింది వసంత. ఇంతలో ఆవిడ భర్త రావడంతో ఎవరి ఇళ్ళల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రోజంతా వసంతకు అందమైన హీరోలాంటి ఆ వ్యక్తే జ్ఞాపకం రాసాగేడు. 'అతను ఎంత అందంగా వున్నాడో' అని అతని అందమైన రూపాన్ని మెచ్చుకుంటూనే ఆ రోజు గడిపేసిందామె.

ఆ మరునాడు సాయంత్రం వీధిలోకి మల్లెపూలు వస్తే పిలిచింది వసంత "ఎలా ఇస్తున్నావోయ్?" అంటూ. ఎదురింటామె వచ్చింది. ఇద్దరూ మల్లె మొగ్గలు బేరమాడుతుంటే నిన్నటి హీరో ట్రిమ్‌గా తయారయ్యి ఆ వీధిలోంచే వెళ్తున్నాడు. అతన్ని చూసిన వసంత గుండె జల్లుమంది. ఎందుకో మధురమైన భావంతో శరీరం జలదరించింది. బిడియంగా తలెత్తి అతనివైపు మళ్ళీ చూడాలనుకునేంతలో అతను చాల దూరం వెళ్ళిపోయాడు.

"చూడండి వసంతా! ఆవిడే అతని భార్య" ఎదిరింటామె వసంత చేయిమీద చిన్నగా గిచ్చి అతనికి కాస్త దూరంలో బంగారుగా నడుస్తూ వెళ్తున్న ఒకామెని చూపించింది.

ఆమె చంకలో ఓ బాబు, మరో చేతిలో ప్లాస్టిక్ బుట్ట వున్నాయి. జారిపోయే కుర్రాడిని చూసుకుంటూ, చేతిలోని బరువుతో ఆమె భర్తవేగాన్ని అందుకోలేక అవస్థపడుతూ గబగబా నడుస్తున్నది. ఆ దృశ్యం చూసిన వసంతకు అతనిమీద కోపం, ఆమెమీద జాలి పొంగుకొచ్చాయి ఒక్కసారిగా.

'ఏం మనిషి అతను? భార్య చేతిలోంచి ఆ బరువైనా తీసుకున్నాడు కాదు, కనీసం పిల్లవాడినైనా తను ఎత్తుకుని నడవచ్చు కదా? ఆ బట్టలెక్కడ నలిగిపోతాయో అని అతని భయం కాబోలు, లేదా భార్య బానిస, సంసార బాధ్యత దానిదే అనే భావంతో, పురుషుడనే అహంకారంతో అలా దర్జాగా నడచి వెళ్ళిపోతున్నాడు కాబోలు. కనీసం భార్య దగ్గరకొచ్చేవరకైనా ఆగవచ్చు కదా' మనసులోనే అతని ప్రవర్తనను ఈసడించుకుంది వసంత. ఆ సమయంలో తనూ భర్త వచ్చేటప్పుడు భర్త తనని ఒక్క సామానైనా పట్టుకోనివ్వకుండా అన్నీ తను, లైసెన్సు కూలీలు మోయడం గుర్తుతెచ్చుకుని భర్తని ఓ క్షణం మెచ్చుకుంది మనసులోనే.

"ఆవిడ కోతిలా ఉంది కదూ!" ఎదు

రింటావిడ హేళనగా అన్న మాటతో ఈ లోకంలోకి వచ్చిన వసంత, తొట్రుపాటుతో "నేను సరిగ్గా చూడలేదండి" అంది నంగినంగిగా.

"హుళోప్మ! చూడలేదూ! పోనీలే రేపు చూద్దువుగానిలే! అతని పక్కనే గనుక విన్ను నిలబెడితేనా! నా సావిరంగా మీ జంట చూట్టానికి ఈ రెండు కళ్ళు చాలవంటే నమ్ము. కాస్త నలుపన్న మాటే గాని మీవారూ బాగుంటారు వసంతా!" అందామె. అంతలోనే తన పొరపాటుని గ్రహిస్తూ, "వివాహాలు స్వర్గంలో అవుతాయట సుందరిగారూ!" పేలవంగా నవ్విందామె.

మల్లిమొగ్గలు ఏంచుకుంటూ ఆమె వసంత మాటలు పట్టించుకోలేదు.

రెండు రోజుల తరువాత మగవాళ్ళు ఆఫీసులకెళ్ళాక వసంతని తీసుకుని ఆ యింటి కెళ్ళింది సుందరి.

అనుకోకుండా వచ్చిన అతిథుల్ని చూసి ఆమె ఖంగారుపడుతూ "రండి!" అని ఆహ్వానించి కూర్చోపెట్టింది. ఇల్లంతా చాల చిందరవందరగా వుంది. కొన్ని సామాన్లు అటూ యిటూ పడి వున్నాయి. పిల్లాడు చాపమీదపడి నిద్రపోతున్నాడు. ఆవిడకూడా రేగిన తలతో నలిగిన చీరతో ఉడ్డుకారుతున్న ముఖంతో నీట్‌నెస్ లేనిదాన్లా కనిపించింది వసంత కళ్ళకి. పట్టి పల్లెటూరి సరుకులా వుంది. చదువూ సంస్కారం లేదు కాబోలు! ఆమెనే పరీక్షగా చూస్తూ మనసులో అనుకుంది వసంత.

"మా ఎదురింట్లో వుంటున్నారు వీళ్ళు. పేరు వసంత" అని, "ఈమె పేరు గిరిజ" అని ఒకరికొకర్ని పరిచయం చేసింది సుందరి.

ఒకరికొకరు నమస్తే చెప్పుకున్నారు.

"పిల్లాడితో నాకు ఏ పనీ కాదండి. వాడ స్తమానూ ఏడుస్తుంటాడు" ఆవిడ చెల్లాచెదురుగా పడివున్న సామాన్లని హడావుడిగా సర్దుతూ చెప్పింది.

"పిల్లలున్న ఇంట్లో ఎంత సర్దినా సర్దనట్లే వుంటుందిలెండి" సుందరి వంత పాడింది ఆమెకి.

వసంత మాట్లాడలేదు. ఆవిడ ముఖం వైపే చూడసాగింది. సుందరి చెప్పినంత అనాకారిగా ఏమీ లేదామె. కాస్త నలుపుగా వున్నా కళగా వుంది ముఖం. పెద్దపెద్ద కళ్ళు, నొక్కుల జుట్టు, కొనదేరిన ముక్కు చూట్టానికి బాగానే వుందామె.

వీళ్ళతో కబుర్లు చెప్తూనే టీ పెట్టి ఇచ్చింది. తను చదివిన కథల పుస్తకాల గురించి చెప్పింది. తనకి సరదాగా అందరిళ్ళకూ వెళ్ళి కబుర్లు చెప్పాలని వుంటుందని కాని పిల్లాడివల్ల పని తీరక ఎవరిళ్ళకూ వెళ్ళడం, పరిచయం చేసుకోవడం కుదరడంలేదని, మీరున్నప్పుడు మీరే వచ్చి కబుర్లు చెప్పి వెళ్ళండని మరీమరీ చెప్పింది.

"అలాగే వస్తుంటాములెండి" అని ఆవిడదగ్గర వీడ్కోలు తీసుకుని వచ్చేసారు. ఇచ్చిన మాట ప్రకారం వసంత రెండురోజులకో మారైనా వెళ్ళి గిరిజతో కబుర్లు చెప్పుకుని, వాళ్ళ బాబుతో కాసేపు ఆడుకుని వస్తున్నది ఈ మధ్య భార్య కాస్త ఉత్సాహంగా కనిపిస్తున్నందుకు చక్రపాణికి సంతోషంగా వుంది. ఆఫీసులో పని ఎక్కువగా వున్నందున అతనూ భార్యతో 'అక్కడికి వెళ్దాం, ఇక్కడికి వెళ్దాం రా' అని బలవంతం చేయడం లేదు. ఆఫీసుకి వెళ్ళడం, రావడం, మత్తుగా నిద్రపోవడం ఇది అతని దినచర్యగా సాగుతున్నది.

వసంతకు మాత్రం గిరిజావాళ్ళ బాబుతో బాగా కాలక్షేపం అవుతున్నది. భర్త ఆఫీసుకి వెళ్ళగానే పని తెముల్చుకుని, గిరిజవాళ్ళింటికి వెళ్తుంది. తను వెళ్ళేసరికి ఒక్కోసారి ఉబ్బిన కళ్ళతో, రేగిన జుట్టుతో కనిపించేది గిరిజ "అలా వున్నారేం? వంట్లో బాగాలేదా?" అడిగేది ఆత్రుతగా. "నాకేం బాగానే వున్నాను" అనో, "కాస్త తలనొప్పిగా వుంది అంతే" అనో చెప్పేది గిరిజ. అంతకు మించి ఆవిడా చెప్పేది కాదు, వసంతా రెట్టించి అడిగేది కాదు.

ఓ రోజు వసంత మరీ బలవంతం చేసేసరికి అయిష్టంగానే వాళ్ళింటికెళ్ళింది గిరిజ. తను చీరలమీద కుట్టిన ఎంబ్రాయిడరీ డిజైన్లు, లేసు అల్లికలు, ఊలుతో కుట్టిన పక్షుల బొమ్మలు అన్నీ చూపెట్టింది వసంత. వాటి నన్నిటినీ ఎంతో ఆసక్తిగా చూస్తూ "మీలో ఎంత అర్టు వుందండి వసంతగారూ" అంది గిరిజ ఆవిడను ప్రశంసిస్తూ.

"ఉత్సాహం, ఆసక్తి వుంటే ఎన్నయినా నేర్చుకోవచ్చు గిరిజగారు!"

"ఉత్సాహం, ఆసక్తి వున్నంతలోనే అన్నీ వచ్చేస్తాయా మీ పిచ్చిగాని. వెనకాల వున్న మన పెద్దవాళ్ళో, కట్టుకున్నవాడో ప్రోత్సహిస్తేనే ఆడది ఎన్నికళల్లో అయినా రాణిస్తుంది. మీ రింత సరదాగా కుట్లు, అల్లికలు చేస్తున్నారంటే దీనికి మీవారి ప్రోత్సాహం కూడ వుంటుంది కదా. కొందరు ఆడవాళ్ళకి జీవితంలో ఎన్నో సాధించాలని వుంటుంది కాని అందుకు అయినవారి ప్రోత్సాహం లభించదు. అటువంటివారికి ఆశలు వున్నా తీరవు కదా? ఏమంటారు వసంతా" గిరిజ మాటల్లో దాగిన వేదన తొంగిచూపింది. వసంత తలెత్తి ఆమె వైపు చూసింది. గిరిజ బైటికి కనిపించేంత ఆనందంగా ఆమె సంసారజీవితం లేదేమో అనే భావం వసంతలో కలిగింది కాని అది కాస్సేపే. పుస్తకాలల్లో వస్తున్న కార్టూన్ల గురించి చెప్పుకుని కాస్సేపు నవ్వుకున్నారు. మాటల్లోపడి బాబు నిద్రపోవడం గమనించలేదు ఇద్దరూను. బాబు కూర్చున్నచోటే బోర్లపడుకుని నిద్దరోతున్నాడు. వాడిని తీసి

మంచంమీద పడుకోపెట్టింది వసంత.

"బెడ్ షీటు పాడు చేస్తాడు నేను వాడిని ఇంటికి తీసుకుపోతాను" అని బాబుని లేవదియ్యబోయింది గిరిజ.

"పాడుచేస్తే ఏమయ్యింది నీళ్ళల్లో ఉతికేస్తే సరి కాని హాయిగా నిద్రపోతున్న వాడిని లేపవద్దు" అని వారించింది వసంత. అప్పుడే వీధిలో సైకిల్ బెల్ వినిపించి ఇద్దరూ వాకిలివైపు చూసారు. సైకిల్ మీద వెళుతున్న వ్యక్తిని చూడగానే గిరిజ ముఖం భయంతో పాలిపోయింది. "అమ్మో ఆయన వచ్చారు. ఇప్పుడెలా?" అంది ఖంగారుపడుతూ.

"ఏం ఆయన తిడతారా?" అడిగింది వసంత.

అప్పటికే గిరిజ గుమ్మందగ్గర కెళ్ళిపోయింది. "నేను వెళుతున్నా వసంత గారూ, బాబులేస్తే పంపించండి" అంది త్వరత్వరగా నడుస్తూ.

వసంత దిమ్మెరపోయి అలాగే నిలబడిపోయింది. ఏం మనిషో బాబూ! మరీ అంత భయమా. భర్త ఏం‌పీ అనకపోయినా కొందరికదో ఫేషన్ 'మావారు తిడతారు, అమ్మో మావారు ఏమంటారో' ఇలా నలుగురిలో బైటపడి తమకి తామే అలుసైపోతారు.

అరది ప్రక్కింటి కెళ్ళినా దండించే భర్తలు. కేకలేసే భర్తలు వున్నారా ఈ రోజుల్లో. తనభర్తే తనని ఎన్నిసార్లో హెచ్చరించాడు 'అలా వంటరిగా కూర్చోకపోతే ఇరుగుపొరుగు ఇళ్ళవార్తో పరిచయం చేసుకోపోయావా వసూ' అని. ఈ గిరిజగారి కిదో అలవాటు కాబోలు. బహుశా ఈవిడకి ఎవరిళ్ళకి వెళ్ళడం ఇష్టంలేకే అలా వంకలు పెడుతుందేమో' గిరిజ మనస్తత్వం గురించి రకరకాలుగా ఊహాగానం చేస్తూ బైటికి తీసిన వస్తువులన్నీ సర్దుకోసాగింది వసంత పది నిముషాలయ్యిందో లేదో బాబు లేచి ఏడుపు అందుకున్నాడు. వాడిని వూరుకోబెట్టాలని చాలా ప్రయత్నించి, ఫలితంలేక గదికి గొళ్ళెంపెట్టి బాబుని ఎత్తుకుని గిరిజవాళ్ళింటికి వెళ్ళింది. తలుపులు మూసివున్నాయి. పిలవనా వద్దా అని తటపటాయిస్తూ తలుపుదగ్గరే నిలుచుంది వసంత. లోపల్నించి గిరిజ ఏడుపు అతని అరుపులు వినిపించసాగాయి.

"నన్ను ఆఫీసుకి వెళ్ళనిచ్చి ఇళ్ళమ్మట షికార్లు బైలుదేరావా. ఎన్నిసార్లు చెప్పినా నీకు బుద్ధిరాదు. సిగ్గు, అభిమానం లేవు. మరొక అడదైతే ఈపాటికి ఏదో మింగి చచ్చును కాని భగవంతుడు నీకు పౌరుషం, అవమానం లేకుండా చేసాడు." అతని గొంతుకాగింది కాని, దేనితోనో కొడుతున్న శబ్దం వినిపించసాగింది. ఆ దెబ్బలన్నీ తన వంటిమీదే పడుతున్నట్లు వణికిపోసాగింది వసంత. బాధతోకూడిన గిరిజగొంతు. "ఏడుపు బైటికి వినిపించిందంటే నీ రక్తం కళ్ళ

చూస్తాను జాగ్రత్త! ఆడముండవి, నా చెప్పుకింద పురుగులా పడివుంటేనే నీకిక్కడ స్థానం ఉంటుంది. నీలాంటి చదువుకున్న ఆడదాన్ని చేసుకోవడం నాదే పొరపాటు..." అతని నోట్లోంచి తిట్ల దండకం వినిపిస్తుంటే ఆ పదజాలం వినలేకపోతున్నది వసంత. 'మేడిపండులాంటి నీ అందం చూసి ఇన్నాళ్ళూ మురిసిపోయాను కాని నీ మనసింత సంకుచితమయింది, విషతుల్యమయింది అని ఇప్పుడే అర్థంచేసుకున్నాను. నువ్వెంత పాషాణ హృదయుడవో నీ నోరే చెప్తున్నది. నీలాంటి భర్తను పొందిన ఆడది చాలా అదృష్టవంతురాలు అని ఇంతకుముందు వరకు తలపోసాను కాని ఎంతో పాపం చేసుకుంటేనే కాని నీలాంటివాడికి భార్య అయ్యి జీవితాంతం నరకం అనుభవిస్తూ వుంటుంది ఆ ఆడది అని ఈ క్షణం నుంచి అనుకుంటున్నాను నీ భార్య చాలా చాలా దురదృష్టవంతురాలు. తన మనసులో కోపాన్ని ఆవేశాన్ని. ఆవేదనను అతనిముందర వెళ్ళగక్కాలని ఉద్రేకపడింది వసంత. గిరిజను తనే తప్పుగా అర్థంచేసుకుంది ఇన్నాళ్ళు. ఎక్కడకు రాదనీ, నవ్వుతూ, తుళ్ళుతూ వుండదనీ, నీటుగా వుండదనీ. కాని, భర్త ప్రవర్తనను బట్టే భార్య ప్రవర్తన ఉంటుందని ఇప్పుడు అనిపిస్తున్నది. వసంత గిరిజ మీద సానుభూతి చూపిస్తూ ఇంటికివెళ్ళనుద్యుక్తురాలయ్యింది కాని ఇంతలోనే తలుపులు దడాలున తెరుచుకున్నాయి. ఈ ఆకస్మిక చర్యకు వసంత, ఆమెని చూసి అతనూ తెల్లబోతూ నిలబడిపోయారు. అతనే ముందు తేరుకుని నవ్వుముఖంతో "మీరు" అన్నాడు సందేహంగా చూస్తూ.

అందమైన ఆ ముఖంలో అమాయకత్వంతో కూడిన ఆ చిరునవ్వు చూస్తే 'ఆహా ఇతను ఎంత అందంగా వున్నాడు. ఆ నవ్వు ఎంత నిర్మలంగా వుంది' అని ముగ్ధులౌతారు కాని అతని స్వభావం ఏమిటో, ఎటువంటిదో కొన్ని క్షణాల క్రితమే చవిచూసి వున్న వసంత మోసపోలేదు. "మీ బాబుని ఇవ్వడానికి వచ్చాను" అని బాబుని అక్కడ దించి వెనక్కి చూడకుండా ఇంటికొచ్చి బరువెక్కిన గుండెతో మంచంమీద వాలిపోయింది.

భర్తవచ్చి పక్కన కూర్చుని తన చేతిని ఆయన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కినప్పుడు వసంతకు మెలకువ వచ్చింది. ఆయన కళ్ళలోకి అనురాగంగా చూసింది. భర్త తన అందానికి దీటుకాదన్న అహంభావంతో తను ఇన్నాళ్లూ విరసనగా నిర్లక్ష్యంగా ప్రవర్తించినందుకు మనస్సు పశ్చాత్తాపంతో నిండిపోయింది. పురుషుడి అందంకన్నా అతని సంస్కారపూరితమైన మనస్సే ఎన్నో రెట్లు అందమైందని కలిగిన అవగాహనతో భర్తవేపు ఆరాధనగా చూస్తూ ఉండిపోయింది. **